క్లుప్తంగా

చింతలపాలెం ఎంపీడీఓ పవన్‌కుమార్ బదిలీ

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు చింతలపాలెం ఎంపీడీఓ పవన్‌కుమార్‌ను బదిలీ చేస్తూ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఎంపీడీఓపై పలు ఆరోపణలు చేస్తూ కలెక్టర్, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంపీడీఓను జాజిరెడ్డిగూడెంకు బదిలీ చేశారు. చింతలపాలెం మండల పంచాయతీ అధికారి ఎస్.భూపాల్‌రెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కోనోకార్పస్ చెట్లు తొలగించాలని వినతి

నేరేడుచర్ల : మండలంలో పర్యావరణానికి హానీ కలిగించే కోనోకార్పస్ చెట్లను తొలగించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఊట్కూరి భార్గవ్‌సైదులు ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పెదపంగ అజయ్‌కుమార్, సైదులు, మధు, రాంబాబు తదితరులు ఉన్నారు.

ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా నరసింహారావు



గరిడేపల్లి : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) గరిడేపల్లి మండల శాఖ అధ్యక్షుడిగా రాయినిగూడెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మీసాల నర్సింహారావును నియమిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుతం పనిచేస్తున్న గొర్రె నాగరాజు కొనసాగుతారని ఆయన పేర్కొన్నారు.

ఎల్- 35 ఎత్తిపోతలకు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఈఈ సత్యనారాయణ

నడిగూడెం : మండలంలోని ఎల్- 35 ఎత్తిపోతల పథకానికి శుక్రవారం నీటి పారుదల ఈఈ సత్యనారాయణ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నీటి సమస్య తలెత్తకుండా పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతులు నీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ దుర్గయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా రమేష్, మాజీ సర్పంచ్ వీరారెడ్డి, అంతయ్య, రైతులు పాల్గొన్నారు.


గర్భిణికి రక్తదానం

హుజూర్‌నగర్ : చిలుకూరు మండలం బేతవోలుకు చెందిన గర్భిణికి కాన్పు నిమిత్తం శుక్రవారం ఏ నెగిటివ్ రక్తం అత్యవసరమైంది. దీంతో వారు నరసింహాచారి ద్వారా హుజూర్‌నగర్‌కు చెందిన జనచైతన్య ట్రస్ట్ సభ్యులు పారాసాయి, పిల్లి శివ శంకర్‌లను సంప్రదించారు. వారు వెంటనే సీతారాంపురంనకు చెందిన తీరిపిరిశెట్టి సంతోష్‌తో మాట్లాడి కోదాడలో గర్భిణికి రక్తదానం చేయించారు. దీంతో వారిని పలువురు అభినందించారు.

జూనియర్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నేరేడుచర్లలోని జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. ఈ కళాశాలలో పేద, మధ్య తరగతికి చెందిన 200 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, కనీస వసతులైన మరుగుదొడ్లు, మూత్రశాలలు, తరగతి గదులు, ఫ్యాన్లు, తాగునీరు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయన వెంట ఎస్ఎఫ్ఐ నాయకులు అభి, సాయి, వరుణ్, వినయ్, గోపి, స్వాతి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న టీఎస్‌జేఏ నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన మహిళా విలేకరి మెండెం రమణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కందుకూరి యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గట్టిగుండ్ల రాములు ఆమె కుటుంబాన్ని పరామర్శించి దశదిన కర్మకు రూ.6500 ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గొట్టె నాగరాజు, అల్వాల రవికుమార్, చిలక సైదులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యం అందేదెలా..

- మునగాల మండలానికి అంబులెన్స్ వాహనం రద్దు
- అత్యవసరంలో సూర్యాపేట నుంచి 108 వాహనం రావడానికి ఆలస్యం
- సమయానికి వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్న పేదలు
- తక్షణమే పునరుద్ధరించాలని మండలవాసుల వేడుకోలు



మునగాల : మండల ప్రజలకు 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మండల కేంద్రంలో అందుబాటులో అంబులెన్స్‌ను తిరిగి పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో 108 వాహనాన్ని రద్దు చేయడంతో 65వ నంబర్ జాతీయ రహదారిపై నిత్యం జరిగే ప్రమాదాల్లో క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం చుట్టుపక్కల ఉన్న సుమారు 30 గ్రామాలకు ఈ వాహనం అందుబాటులో ఉంటే పేద ప్రజలు అనారోగ్యానికి గురైతే తక్షణమే వచ్చి సకాలంలో ఆసుపత్రికి తరలించే వారని, ప్రస్తుతం అంబులెన్స్ రద్దు చేయడంతో పేదవర్గాల వారికి తీవ్ర నష్టం జరుగుతుందని అంటున్నారు.

సకాలంలో వైద్యం అందక..

ఇటీవల తాడువాయి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రాగిశెట్టి శ్రీనివాస్‌కు గుండెపోటు రావడంతో 108 వాహనానికి ఫోన్ చేస్తే మునగాలలో అందుబాటులో లేకపోవడంతో సూర్యాపేట నుంచి మరో వాహనం వచ్చినప్పటికీ సకాలంలో వైద్యం అందక మృతి చెందాడని గ్రామానికి చెందిన పలువురు ఆరోపిస్తున్నారు. 65వ నంబర్ జాతీయ రహదారి మండలంలో 27 కి.మీ పరిధిలో విస్తరించి ఉందని, ఎక్కడ, ఏ సమయంలో ప్రమాదం జరిగినా పావుగంటలో అందుబాటులో ఉండే వాహనం ప్రస్తుతం లేకపోవడంతో ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారికి సకాలంలో వైద్యం అందడం లేదు. ఇప్పటికైనా కోదాడ ఎమ్మెల్యే పద్మావతి తక్షణమే స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన 108 వాహనాన్ని పునరుద్ధరించాలని, లేనియెడల మండల ప్రజలను పెద్దఎత్తున సమీకరించి ఆందోళన చేపడతామని పలువురు సామాజిక ఉద్యమకారులు హెచ్చరించారు.

నిరాహార దీక్ష చేస్తా



"మండలానికి కేటాయించిన 108 వాహనాన్ని రద్దుచేయడం సబబు కాదు. తక్షణమే వాహనాన్ని పునరుద్ధరించాలి. లేనియెడల మండల కేంద్రంలో అమరణ నిరాహార దీక్ష చేస్తా. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతా.

– గంధం సైదులు, సామాజిక కార్యకర్త, మునగాల

అంబులెన్స్‌ను పునరుద్ధరించాలి



"మునగాలలో రద్దు చేసిన 108 వాహనాన్ని తిరిగి పునరుద్ధరించకుంటే బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళన, ఉద్యమం చేపడతాం. అంబులెన్స్ రద్దుతో హైవేపై జరిగే ప్రమాదాల క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందుబాటులో లేకుండా పోయింది. గ్రామీణ ప్రాంతాల్లో అనారోగ్యానికి గురైన పేదలు 108 వాహనం లేక ఇబ్బందులు పడుతున్నారు. అంబులెన్స్‌ను తక్షణమే పునరుద్ధరించాలి.

– పోలంపల్లి సుధాకర్‌గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆకుపాముల

సాగు నీరందించాలని రైతుల ధర్నా



గానుగబండలో రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

గరిడేపల్లి : సాగర్ నీళ్లు రాకపోవడంతో తమ నారుమళ్లు ఎండిపోతున్నాయని, తక్షణమే నీటిని అందించాలని శుక్రవారం గరిడేపల్లి మండలంలోని గానుగబండలో రైతులు రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. సాగర్ ఎడమ కాల్వకు సాగు నీరు విడుదల చేసి వారం రోజులు అవుతున్నా 10 నంబర్ మేజర్ కాల్వ నుంచి ఎల్- 9 గానుగబండ మేజర్ కాల్వ పరిధిలోని గానుగబండ, హనుమంతులగూడెం, కొండాయిగూడెం, గంగానగర్ గ్రామాలకు సాగు నీరు రాలేదని తెలిపారు. గరిడేపల్లి నుంచి అలింగాపురం వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ అధికారుల జాప్యంతోనే నీరు అందడం లేదని ఆరోపించారు. కాంట్రాక్టర్ త్వరితగతిన బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోకల వెంకటేశ్వర్లు, పాకాల పరమేష్, కడియాల అప్పయ్య, నందాల్య అంజిరెడ్డి, కట్టా నరసింహారావు, మంగళపల్లి నాగేంద్రబాబు, ఈతా ఆంజనేయులు, నాగేశ్వరరావు, పోకల నరసింహారావు, వెంకయ్య, జొన్నలగడ్డ వీరయ్య, పంగ నరసింహారావు, సైదులు, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో ఆశా వర్కర్ల రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

నేరేడుచర్ల : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి యూపీహెచ్ ఆస్పత్రిలో ఆశా కార్యకర్తల సమావేశంలో ఆశా వర్కర్ సమ్మక్కను అసభ్యపదజాలంతో దూషించిన సూపర్‌వైజర్ మధును తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు శుక్రవారం నేరేడుచర్లలో కోదాడ- జడ్చర్ల జాతీయ ప్రధాన రహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ నీలా రామ్మూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు తులసి, మంజుల, ధనలక్ష్మి, స్వప్న, లక్ష్మి, విజయ, రాణి, జ్యోతి, సుకన్య, సునిత, యశోధ, రజిత, స్వర్ణ ఉన్నారు.

పెన్షనర్ల భవనం.. ప్రారంభానికి సిద్ధం

- రేపు మంత్రి ఉత్తమ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం



విశ్రాంతి ఉద్యోగుల నూతన భవనం

నేరేడుచర్ల : పట్టణంలో నూతనంగా నిర్మించిన విశ్రాంతి ఉద్యోగుల భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఆదివారం మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి పోతుగంటి సత్యనారాయణలు శుక్రవారం తెలిపారు. కొణతం గోపిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కొణతం కృష్ణారెడ్డి- సంధ్య దంపతులు అయ్యప్ప దేవాలయం వెనుక భాగంగా భవన నిర్మాణానికి 125 చదరపు గజాల స్థలం విరాళంగా ఇవ్వగా భవనం నిర్మించారు. ఈ భవన ప్రారంభోత్సవానికి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, పెన్షనర్ల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, సుదర్శన్, రాంబాబు, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ అలక సరితాసైదిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి పూజలు



మఠంపల్లిలో వరలక్ష్మి పూజ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు

మఠంపల్లి : శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం మఠంపల్లి మండల కేంద్రంలో ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు, మహిళలు సామూహికంగా వరలక్ష్మి పూజ, వాసవీ కన్యకాపరమేశ్వరికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అదే విధంగా లలితాసహస్ర నామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్నెలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన వ్యాయమ ఉపాధ్యాయుడు బత్తిని హుస్సేన్, హిందీ ఉపాధ్యాయురాలు మహ్మద్ యాస్మిన్‌లు, నూతనంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు రాఘవారెడ్డి, గోపయ్య, శ్యాంసుందర్‌రావు, యాదయ్య, అనిల్‌కుమార్, సైదులు, నవీన్, ఏసుపాదం, లింగయ్య, నవీన్‌కుమార్, నాగమణి తదితరులు ఉన్నారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన

మోతె : గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని లయోలా అకాడమీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు శుక్రవారం మోతె మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛ భారత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యాప్ ద్వారా స్వచ్ఛభారత్, గ్రామీణ వ్యవసాయ స్థితిగతులను వివరించారు. కార్యక్రమంలో అంజలి, ఈశా, శ్వేత, సుస్మిత, స్నేహ, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు



బోనాలతో ఆలయానికి తరలివెళ్తున్న మహిళలు

నేరేడుచర్ల : శ్రావణ మాసం సందర్భంగా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని పాత నేరేడుచర్లలో శుక్రవారం ముత్యాలమ్మ పండుగను ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మట్టి కుండను పసుపు, కుంకుమ, వేప మండలతో అలంకరించి డప్పుచప్పుళ్లతో ఆలయానికి చేరుకుని ముత్యలమ్మకు బోనం (నైవేద్యం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంట పచ్చగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

పైపులైనుకు మరమ్మతులు



పైపులైనుకు మరమ్మతులు చేసిన సిబ్బంది

మునగాల : మండలంలోని గణపరంలో శివారులో గురువారం ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణంలో భాగంగా పనులు చేపడుతుండగా మిషన్ భగీరథ పైపులైన్ పగిలింది. దీంతో తాగునీరు వృథా అవుతుండడంపై సాక్షి దినపత్రికలో శుక్రవారం 'మిషన్ భగీరథ నీరు వృథా'అనే శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో మిషన్ భగీరథ లైన్‌మెన్, సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని పైపులైనుకు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టారు.

సాక్షి ఎఫెక్ట్..

రావిపహాడ్ మాజీ ఎంపీటీసీ వెంకటమ్మ మృతి

మోతె : మండలంలోని రావిపహాడ్ గ్రామ మాజీ ఎంపీటీసీ గునగంటి వెంకటమ్మ (70) గురువారం రాత్రి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మృతి చెందారు. శుక్రవారం రావిపహాడ్‌లో వెంకటమ్మ మృతదేహాన్ని పలువురు నాయకులు, గ్రామస్తులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఘనంగా కుంకుమ పూజ



గుండాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గరిడేపల్లి : శ్రావణమాసం సందర్భంగా గరిడేపల్లి మండల కేంద్రంలోని గుండాలమ్మతల్లి దేవాలయంలో శుక్రవారం మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. శ్రావణమాసం పూర్తయ్యేవరకు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు.

వారోత్సవాలను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో ఈనెల 11న నిర్వహించబోయే శ్రీసర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్ హాల్‌లో జయంతి వారోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాగేశ్వరరావు, నరసింహారావు, వెంకటేశ్వర్లు, నరసింహ, సైదులు, అభిమన్యు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తా

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతి



బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

అనంతగిరి : ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. అనంతగిరి మండల పరిధిలోని బొజ్జగూడెం తండాలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆమె పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వామివారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బుర్ర సుధారాణిపుల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, ధరావత్ రామ, వర్కింగ్ ప్రెసిడెంట్ బాబునాయక్, గుర్రం వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు బానోతు వెంకటేశ్వర్లు, దారావత్ కృష్ణానాయక్, సైదులు, గుగులోతు శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



గంగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి, తదితరులు

చిలుకూరు : మండలంలోని సీతారాంపురం గుట్టలలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు బొర్రా వాసుదేవాచార్యులు, సిరికొండ అనంతకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలన్నారు. తదనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లంమల్లయ్య యాదవ, ఆలయ కమిటీ అధ్యక్షుడు తొడేటి సత్యనారాయణ, కార్యదర్శి తోడేటి రాంబాబు, మాజీ జెడ్పీటీసీ గన్నా చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు కుర్రా అచ్చయ్య, పల్లా ఉపేందర్, పల్లా గురునాథం, పులగం రవీందర్, కుర్రా వెంకటయ్య, గన్నా ప్రసాద్, గన్నా అజయ్, సందానీ, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం !

- తన ఇంట్లోకి మురుగు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఓ వ్యక్తి నిరసన
- ఇబ్బందులు పడిన తండావాసులు



తాళం వేసి ఉన్న ట్రాన్స్‌పార్మర్

నేరేడుచర్ల : గ్రామంలోని మురుగునీరంతా తన ఇంట్లోకి వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఓ వ్యక్తి ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేసి నిరసన తెలిపాడు. ఈ సంఘటన నేరేడుచర్ల మండలంలోని పులగంబండతండా గ్రామ పంచాయతీ పరిధిలోని జగనాతండాలో చోటు చేసుకుంది. వివరాలు.. జగనాతండాలో రమావత్ శివ శుక్రవారం ఉదయం ట్రాన్స్‌పార్మర్‌కు తాళం వేశాడు. దీంతో తండవాసులు విద్యుత్‌తో పాటు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై స్థానికులు నేరేడుచర్ల పోలీసులకు సమాచారం అందించడంతో వారు గ్రామానికి చేరుకుని తాళం తీయాలని శివకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా అతను వినలేదు. బలవంతంగా ట్రాన్స్‌ఫార్మర్ తాళం తీస్తే విద్యుత్ తీగలు పట్టుకుంటానని బెదిరించాడు. దీంతో పోలీసులు ఏమి చేయలేక వెనుదిరిగారు. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీను.. లైన్‌మెన్ సైదులుకు ట్రాన్స్‌ఫార్మర్ తాళం తీయించాలని చెప్పారు. దీంతో లైన్‌మెన్ వెళ్లి శివతో మాట్లాడి తన సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నచ్చచెప్పడంతో రాత్రి శివ ట్రాన్స్‌ఫార్మర్ తాళం తీశాడు. ఈ విషయంపై శివ విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలోని మురుగునీరంతా తన ఇంట్లోకి వస్తుందని, విషయాన్ని గత నెల రోజులుగా అధికారులు, గ్రామస్తులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని అందుకే ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేశానని తెలిపారు. తన సమస్యను ఇప్పటికైనా పరిష్కరించాలని ఆయన కోరారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



మునగాల : బరాఖత్‌గూడెంలో మొక్క నాటుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ



చిలుకూరు : పీహెచ్‌సీ ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ, సిబ్బంది



మఠంపల్లి : రఘునాథపాలెంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న హెచ్ఎం, కార్యదర్శి



హుజూర్‌నగర్‌రూరల్ : ఆలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గిరిబాబు

చిలుకూరు : ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. పచ్చదనం- స్వచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిలుకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆయన మొక్క నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, ధర్మయ్యగౌడ్, గ్రామ పంచాయతీ, ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'స్వచ్ఛదనం- పచ్చదనం'

మునగాల : మండలంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం బరాఖత్‌గూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఉపాధి హామీ ఏపీఓ శైలజ పాల్గొని మొక్క నాటారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఏఈలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు, ఉపాధి సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మఠంపల్లి : మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం శుక్రవారం ఐదవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా రఘునాథపాలెంలో హెచ్ఎం, కార్యదర్శి, విద్యార్థులతో కలిసి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. మఠంపల్లిలో మండల ప్రత్యేక అధికారి, కార్యదర్శి, అంగన్‌వాడీలు, ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. పారిశుద్ధ్య పనులు చేపట్టారు. చౌటపల్లి, బక్కమంతులగూడెం, చెన్నాయిపాలెం, కామంచికుంటతండా, హనుమంతులగూడెం తదితర గ్రామాల్లో మురుగు కాలువలు శుభ్రం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి సంధ్యారాణి, హెచ్ఎం బుడిగె పిచ్చయ్యగౌడ్, కార్యదర్శులు లక్ష్మణ్‌నాయక్, క్రాంతి, విజయ, ఎం.వెంకటేశ్వర్లు, జేపీ మట్టయ్య, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వలంటీర్లు, విద్యార్థులు ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

హుజూర్‌నగర్‌రూరల్ : మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలో గల ఆదివరాహ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈఓ లక్ష్మణరావుతో కలిసి మొక్క నాటారు. అనంతరం గ్రామంలో పచ్చదనం –స్వచ్ఛదనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఓ శైలజ, ఇన్‌చార్జ్ కార్యదర్శి గిరిజాకుమారి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరేడుచర్లలో డ్రై డే



8వ వార్డులో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న వార్డు అధికారి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని 8వ వార్డులో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. పాత నేరేడుచర్ల, శాంతినగర్, బట్టువానికుంట, రామాపురం, కోట్లగడ్డ గ్రామాల్లో నీటి నిల్వలను తొలగించి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు అధికారి నజీర్, ఆర్పీ శివలక్ష్మి, కోదమగుండ్ల నగేష్, ఆవుల రాములు ఉన్నారు.

బూరుగడ్డ ఆలయంలో సహస్రనామ కుంకుమార్చన

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, సహస్రనామ కుంకుమార్చనలు, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, అలంకరణ, గోపూజ, అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్ చార్యులు, సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవింద రెడ్డి, రమేష్, ఉపేందర్, భక్తులు పాల్గొన్నారు.